క్లుప్తంగా

మొక్కలను సిద్ధంగా ఉంచాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ సాయన్న

ఇచ్చోడ: హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. నర్సరీల మొక్కల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు సమృద్ధిగా పడిన వెంటనే జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటాలన్నారు. నర్సరీలో పెరుగుతున్న ప్రతీ మొక్కను కాపాడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్వార్టర్‌లో ప్రత్యేక పూజలు



దేవి భక్త శేఖర్ మహరాజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేల నివాస సముదాయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కేటాయించిన క్వార్టర్‌లో దేవి భక్త శేఖర్ మహరాజ్ ప్రత్యేక పూజ లు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు, కుటుంబసభ్యులు మహరాజ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సేవాలాల్ ధర్మ ప్రచారక్ ఆడె ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా సంధ్యారాణి

బేల: జిల్లా కేంద్రంలోని భూసార పరీక్ష కేంద్రంలో వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న సంధ్యారాణి గురువారం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. దీంతో పాటు మండల కేంద్రంలోని మన గ్రోమోర్‌లో తనిఖీలు చేపట్టారు. విత్తనాలు, ఎరువుల స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ కోఆర్డినేటర్ వనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్‌లో తెలుగు మీడియంలో ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఎస్సెస్సీ సర్టిఫికెట్, టీసీ, బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్‌లతో దరఖాస్తు అందించాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియలు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ గ్రామ పక్కన మల్లేష్‌పేట్ వద్ద గుర్తు తెలియని మృతదేహానికి గురువారం ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. బ్లూకలర్ టీషర్టు, గ్రేకలర్ ప్యాంటు ధరించిన ఉన్నాడని, స్థానికులకు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. ఘటన స్థలానికి వెళ్లగా.. కుళ్లిపోయే స్థితిలో ఉందని, పోస్టుమార్టం నిర్వహించి అక్కడే దహనం చేసినట్లు పేర్కొన్నారు.

విగ్రహ వార్షికోత్సవం

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో హనుమాన్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహ మొదటి వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నీలగిరి సాగు చేపట్టాలి

గుడిహత్నూర్: అటవీహక్కు భూములు, పోడు భూములు, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములు, తక్కువ సారం కలిగిన భూముల్లో నీలగిరి సాగును ప్రోత్సహించేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా చేయూతనందిస్తున్నట్లు ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై అన్నారు. ఆసక్తి గల రైతులు వారి పేర్లను నమోదు చేసుకొని నీలగిరి సాగుతో లబ్ధి పొందాలన్నారు. సమావేశంలో ఏపీవో శామ్యూల్, ఈసీ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో.. గుంతలు

పొచ్చెర వంతెనపై ఏర్పడిన గుంత



సాయినగర్ వంతెనపై గుంత





కోరమాండల్ వద్ద..

మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. పొచ్చెర, సాయినగర్, కోరమాండల్ వంతెనపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. గత నాలుగేళ్లుగా వంతెనపై గుంతలు ఉన్నా.. అధికారుల మాత్రం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. – బోథ్

‘బడిబాట’ విజయవంతం చేయండి



తాంసి: మాట్లాడుతున్న ఎంపీడీవో శేఖర్

తాంసి: సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శేఖర్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, స్వయం సహాయక సంఘ సభ్యులు, వీవోఏలు, సీఆర్పీలు, ఎస్ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శేఖర్ మాట్లాడుతూ.. జూన్ 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలు గురించి వివరించారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఏఎస్సై సురేందర్, ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయ, పంచాయతీ కార్యదర్శి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: 1న బడిబాట సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో ఉదయ్‌రావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10.30 గంట లకు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాములు, ఎస్సీ, బీసీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు హాజరు కావాలని కోరారు.

బోథ్: జూన్ 3 నుంచి ప్రారంభించనున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోథ్ ఎంపీడీవో రమేశ్, మండల విద్యాధికారి భూమారెడ్డి అన్నారు. గురువారం బోథ్ మండల కేంద్రంలోని రైతువేదికలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్లు, మండల సమాఖ్య అధ్యక్షులు, ఐకేపీ ఏపీఎం, విద్యాశాఖ సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. బడి మానేసిన పిల్లలను వారి వయసు విద్యార్హతను బట్టి పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్య ఆవశ్యకతను పిల్లల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు చదువుకునే విధంగా చూడాలన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి భూమారెడ్డి, ఐకేపీ ఏపీఎం మాధవ్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



బోథ్: మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

నార్నూర్: ప్రతీ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ, బడిబాట కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని ఎంపీడీవో జవహర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో ఆశన్నతో కలిసి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 3తేదీ నుంచి ప్రతీ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విద్యార్థులకు సరైన సమయంలో యూనిఫాంఅందజేసిన బాధ్యత ఏటీఎం తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలి



జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎదులాపురం: కార్మిక ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం యూనియన్ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులకు, కార్మికులకు పంచిపెట్టారు. ఐక్యత పోరాటం అనే నినాదంతో ఏర్పడిన సీఐటీయూ నాటి నుంచి నేటి వరకు భారతదేశ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై, కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం కార్మిక చట్టాలను సవరిస్తూ.. నిర్వీర్యం చేస్తూ చివరకు నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. అమరవీరుల స్ఫూర్తితో భారత కార్మికవర్గం చేపడుతున్న హక్కులు, చట్టాల పునరుద్ధరణ పోరాటంలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, పండుగ పొచ్చన్న, తోకల శ్రీకాంత్, సిరిగిరి దశాంత్, దర్శనాల నగేశ్, మంజుల, సుజాత, రమాకాంత్, రాంజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న జొన్న కొనుగోళ్లు

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జొన్న కొనుగోళ్లు శుక్రవారంతో ముగియనున్నాయని సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంటను మధ్యాహ్నం రెండు గంటలలోపు మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. రైతులు గమనించాలని కోరారు.

ముగిసిన జొన్న కొనుగోళ్లు

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో చేపట్టిన జొన్న కొనుగోళ్లు గురువారంతో ముగిసినట్లు సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు. మార్క్‌ఫెడ్ డీఎం ఆదేశానుసారం కొనుగోలు నిలిపివేస్తున్న ట్లు పేర్కొన్నారు. రైతులు 31 నుంచి మా ర్కెట్ యార్డుకు జొన్నలు విక్రయానికి తీసుకురావద్దని కోరారు. తాంసి సబ్ మా ర్కెట్లో ఈ ఏడాది 38వేల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు వివరించారు.

హనుమాన్ పల్లకి ఊరేగింపు



జామిడిలో పల్లకి ఊరేగిస్తున్న స్వాములు

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో గురువారం హనుమాన్ దీక్షదారులు హనుమాన్ పల్లకిని ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో హనుమాన్ భారీ విగ్రహాన్ని ఉంచి శోభాయాత్ర చేపట్టారు. మహిళలు మంగళ హారతులతో ఊరేగింపులో పాల్గొనగా, హనుమాన్ స్వాములు భక్తి గీతాలు ఆలపిస్తూ, నృత్యం చేశారు. పల్లకి ఊరేగింపుతో గ్రామం హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కేశవ్ రెడ్డి, గ్రామపెద్దలు వినోద్ రెడ్డి, సురేందర్, రఘు రెడ్డి, అమర్, అశోక్, హనుమాన్ దీక్షాదారులు పాల్గొన్నారు.

సాగుకు ముందస్తు ప్రణాళిక అవసరం



బిర్రు భాస్కర్, మండల వ్యవసాయాధికారి

నేరడిగొండ: వానాకాలం సాగుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని నేరడిగొండ మండల వ్యవసాయాధికారి బిర్రు భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన ‘సాక్షి’తో పలు విషయాలను వివరించారు.

సాక్షి: వానాకాలం సీజన్‌కు ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారు?

ఏవో: వానాకాలం సాగు రైతు సన్నాహక సమావేశాలు నిర్వహించాం. కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలోని రైతులకు సూచనలు ఇచ్చాం.

సాక్షి: పంట వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

ఏవో: ఏప్రిల్, మే నెలల్లో పొలాలు దున్నుకోవడం చాలా ముఖ్యం.

సాక్షి: రుతుపవనాలు ప్రవేశించగానే విత్తుకోవచ్చా?

ఏవో: జూన్‌లో నల్లరేగడిలో 45 శాతం, ఎర్ర నేలల్లో 65 శాతం వర్షం కురిసినప్పుడే విత్తుకోవాలి. తడిసీ తడవని భూముల్లో విత్తరాదు.

సాక్షి: విత్తే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

ఏవో: తొలకరి వర్షం కురిశాక విత్తే ముందు వంద గింజలను ఇంటివద్దే తొట్టిలో వేసి మొలక శాతాన్ని గమనించి విత్తుకోవాలి. వంద విత్తనాల్లో 80 మొలక శాతం ఉంటే విత్తుకోవచ్చు. దీని ద్వారా రైతులకు పెట్టుబడి, విత్తనాల ఇబ్బందులు చాలా వరకు తొలగుతాయి.

సాక్షి: విత్తన శుద్ధి ఎలా?

ఏవో: వివిధ పంటలకు వివిధ రకాల్లో విత్తన శుద్ధి ఉంటుంది. పెసర, మినుములకు క్యాప్టన్, థైరమ్, కందులకు ట్రైకోడర్మ, విరిడితో విత్తన శుద్ధి చేసుకోవాలి.

సాక్షి: విత్తన శుద్ధితో ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చు?

ఏవో: విత్తన శుద్ధితో తెగుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లు, ఎండు తెగుళ్లను నివారించుకోవచ్చు.

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

బజార్‌హత్నూర్: ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనులను పకడ్బందీగా చేపట్టాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. గురువారం మండలంలోని బజార్‌హత్నూర్, పిప్రి, గిర్నూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులను, నర్సరీలను పరిశీలించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం పూటనే పనులు ముగించుకోవాలని సూచించారు. వచ్చే హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఐకేపీ మహిళ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల యూనిఫాంల కుట్టు సెంటర్‌ను సందర్శించారు. ప్రభుత్వ బడులలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించి యూనిఫాంలను త్వరితగతిన కుట్టించి జూన్ 12లోగా విద్యార్థులకు అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం గణేష్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

కైలాస్‌నగర్: సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మహిళా కార్మికురాలు దేవమ్మ సంఘ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. కార్మికుల కోసం ప్రాణ త్యాగాలు చేసిన నాయకులను స్మరించుకుని కొనియాడారు. కార్యక్రమంలో సీఐ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, బొజ్జ ఆశన్న, దర్శనాల నగేశ్, ఉషన్న, ఆత్మారాం, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. దివ్యాంగుల చట్టం 1995, 2016 సెక్షన్ 92పై ముద్రించిన అవగాహన పోస్టర్‌ను గురువారం ప్రజా సేవభవన్‌లో దివ్యాంగులతో కలిసి ఆవిష్కరించారు. దివ్యాంగులకు చట్టపరంగా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో హ్యాండిక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఇమ్రాన్, ఫైజల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి



- భారీగా పెరిగిన అమ్మకాలు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం

బోథ్: మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ఖర్చుతో అధిక దూరం ప్రయాణం చేసే అవకాశం ఉండడంతో ప్రజలు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. పెట్రోల్, డీజిల్ అంటూ బంకుల ఎదుట పడిగాపులు కాసే రోజుల నుంచి విముక్తి పొందేలా ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు మూడుచక్రాలు, నాలుగు చక్రాల వాహనాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ఇంట్లో డీజిల్, పెట్రోల్ వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఒక ఎలక్ట్రిక్ వాహనం కూడా అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలు ఆలోచిస్తున్నారు. బ్యాటరీ రీచార్జితో 100 నుంచి 400 కిలోమీటర్లు ప్రయాణించే అవకాశం ఉండడంతో వాహనాదారుల ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. వారి అవసరాలకు అనుగుణంగా కంపెనీలు సైతం వాహనాలను అందుబాటులోకి తెస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో టీజీ ఆర్టీసీ కూడా ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తోంది. ఇలా విద్యుత్తు వాహనాల కొనుగోలు రోజురోజుకూ ఊపందుకుంది. ప్రస్తుతం మార్కెట్లో వాహనాన్ని బట్టి రూ.60 వేల నుంచి రూ.25 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్లో ఈ వాహనాలకు సంఖ్య మరింత పెరగనుంది.

జిల్లాలో పెరిగిన వినియోగం..

జిల్లాలో ఇప్పటికే ఎలక్ట్రిక్ బైక్‌ల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. పల్లెల్లో కూడా ప్రస్తుతం ఎలక్ట్రికల్ బైక్‌లు దర్శనమిస్తున్నాయి. కొత్త బైక్ కొనాలనుకుంటున్న ముగ్గురిలో ఒకరు ఎలక్ట్రికల్ బైక్‌ను కొంటున్నారు. బైక్‌లే కాకుండా ఎలక్ట్రికల్ ఆటోలు, కార్ల అమ్మకాలు పెరిగాయి. అందుబాటు ధరల్లో ఉండడం, వాహనాలకు పలు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు లోన్ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఎలక్ట్రికల్ వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

తక్కువ ఖర్చుతో..



నాది బోథ్ మండల కేంద్రం. నేను నేరడిగొండ మండలంలో గల టోల్‌ప్లాజాలో ఎలక్ట్రీషన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతీ రోజు దాదాపు 50 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తుంది. పెట్రోల్ కోసం రూ. 120లు ఖర్చు అయ్యేది. నెలకు రూ. 3000లు పెట్రోల్‌కే ఖర్చు అయ్యేది. గత మూడు నెలల క్రితం ఎలక్ట్రిక్ బైక్ కొన్నాను. ఒకసారి రీచార్జ్ చేస్తే 150 కిలోమీటర్లు ప్రయాణిస్తోంది.

– పుట్టి నరేశ్, బోథ్

ఎంతో ఉపయోగకరం



నాది వడూర్ గ్రామం. ప్రతీ రోజు నేరడిగొండ మండల కేంద్రానికి వస్తుంటాను. పెట్రోల్ కోసం రోజు రూ. 100 ఖర్చు అయ్యేవి. వీటితో పాటు వాహన నిర్వహణ కోసం ఖర్చు ఉండేది. రెండు నెలల క్రితం ఎలక్ట్రిక్ బైక్ కొన్నాను. ప్రస్తుతం ఎలాంటి ఖర్చు లేదు. ఎంతో ఉపయోగకరంగా ఉంది. నాతో పాటు చాలా మంది ఎలక్ట్రిక్ వాహనాలు కొన్నారు.

– ద్యావంత్ శేఖర్, వడూర్

కూలీలకు కనీస వేతనం అందించాలి



మాట్లాడుతున్న అంబుడ్స్ మెన్ వీణా

నేరడిగొండ: జాతీయ ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనం అందేవిధంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని అంబుడ్స్ మెన్ వీణా అధికారులను ఆదేశించారు. మండలంలోని వడూర్, పీచర గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ పనులను పరిశీలించి వారికి కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. నీటి నిల్వలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనికోసం ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆమె వెంట ఈజీఎస్ ఏపీవో వసంతరావు, టీఏ రజిత, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు



మాట్లాడుతున్న ఏవో వివేక్



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తహసీల్దార్ దిలీప్ కుమార్, మండల వ్యవసాయాధికారి అష్రఫ్‌లు అన్నారు. గురువారం మండలంలోని అంకోలి విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న స్టాక్ రికార్డులు, స్టాక్ బోర్డు, లాట్ నంబర్, తదితర వాటిని పరిశీలించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో వారికి రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతులు లైసెన్స్‌లు కలిగిన విత్తనాల దుకాణాల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్త పడాలి

జైనథ్: పత్తి విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్త పడాలని ఏవో వివేక్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఒకే కంపెనీకి చెందిన విత్తనాలు కాకుండా మంచి కంపెనీల వివిధ రకాల విత్తనాలు విత్తుకోవాలన్నారు. లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. రసీదుపై రైతు పేరు, ఊరు, విత్తనం లాట్ నంబరు, ప్యాకెట్‌ల సంఖ్య, రైతు, డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని సఖీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఒయాసిస్, ఓసియన్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లలో కంప్యూటర్ నేర్చుకునే విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళ, బాలికల, గృహహింస, బాల్య వివాహాలు, పోక్సో, సైబర్ క్రైం తదితర చట్టాల గురించి వివరించారు. సఖీ సేవలైన కౌన్సెలింగ్, న్యాయ, పోలీసు సహాయంతో పాటు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అత్యవసర సమయంలో హెల్ప్‌లైన్ నెంబర్లు 181, 100, 1098, 1930లపై సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది రాజమణి, విద్యార్థులు పాల్గొన్నారు.